మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

అభివృద్ధిపై రాద్ధాంతం వద్దు

- పదేళ్లల్లోనే నగరాన్ని అద్భుతంగా తీర్చిదిద్దాం
- మున్ముందూ మరింత కృషి చేస్తాం • ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్ కార్పొరేషన్, జూన్ 23: 'పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశాం..విరివిగా నిధులు మంజూరు చేయించి అద్భుతంగా తీర్చిదిద్దినం.. దీనిపై ప్రస్తుత సర్కారు రాద్ధాంతం చేయద్దు.' అని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పేర్కొన్నారు. ప్రభుత్వం నగరంలో కొనసాగుతున్న పనులను పూర్తిచేయాలే గాని అడ్డు పడవద్దని కోరారు. గెలిపించిన ప్రజలు శభాష్ అనే విధంగా అధికారంలో ఉన్నవారు ముందుకు సాగాలని సూచించారు. ఆదివారం కరీంనగర్ 24వ డివిజన్‌లో రూ.1.20 కోట్లతో నిర్మించిన ఎకలవ్య కమ్యూనిటీ హాల్‌ను మేయర్ వై సునీల్‌రావుతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా గంగుల మాట్లాడుతూ తాము అధికారంలో ఉన్న లేకున్న కూడ నగరాభివృద్ధి కోసం పాటుపడుతామని చెప్పారు. చేపట్టిన పనులన్నింటినీ పూర్తి చేసేందుకు చిత్త శుద్ధితో కృషి చేస్తామన్నారు. కిసాన్‌నగర్ వాసులు గతంలో రోడ్లు, మురుగుకాల్వలు లేక ఎంతో ఇబ్బంది పడ్డారని గుర్తుచేశారు. తాము గత పదేళ్లలో ఈ ప్రాంతంలో అన్ని వీధుల్లోనూ సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించామని చెప్పారు. వచ్చే రోజుల్లోనూ ఈ ప్రాంత, నగరాభివృద్ధి కోసం అన్ని విధాలుగా కృషి చేస్తామని తెలిపారు.

కించపరిచేలా మాట్లడద్దు: మేయర్

నగరాభివృద్ధిపై కొందరు కించపరిచేలా మాట్లాడడం బాధాకరమని మేయర్ సునీల్‌రావు అన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా మాజీ సీఎం కేసీఆర్, మాజీ ఎంపీ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ చొరవతోనే భారీగా నిధులు వచ్చాయన్నారు. వీటితో నగరాన్ని అత్యంత సుందరంగా తీర్చిదిద్దామన్నారు. పదే పదే అవినీతి అంటే ఆరోపణలు చేయడం కాదని, నిరూపించాలని సవాల్ విసిరారు. ఈ విషయంలో ఎలాంటి విచారణకైనా సిద్ధమని తేల్చిచెప్పారు. అధికారాన్ని ప్రజల మేలు కోసమే ఉపయోగించామని స్పష్టం చేశారు. సమావేశంలో స్థానిక కార్పొరేటర్లు కుర్ర తిరుపతి, ఎడ్ల సరిత అశోక్, నాంపెల్లి శ్రీనివాస్, తొట రాములు, ఐలేందర్, శ్రీకాంత్, నాయకులు నక్క కృష్ణ, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రైవేట్' దోపిడీ?

- అడ్మిషన్లకే వేలకు వేలు
- పుస్తకాలు, యూనిఫాంలకు రూ.10వేల నుంచి రూ.15వేలు
- నర్సరీ నుంచే దండుకోవడంలో పోటాపోటీ
- తల్లిదండ్రులపై ఫీజుల గుదిబండ
- చోద్యం చూస్తున్న విద్యాశాఖ అధికారులు

పలు పాఠశాలల 'ప్రత్యేక' బాదుడు

కార్పొరేట్ హంగులంటూ తోక పేర్లను తగిలించుకుని పలు ప్రైవేట్ పాఠశాలలు దోపిడీకి తెరలేపాయి. విద్యార్థుల తల్లిదండ్రులపై ఫీజుల గుదిబండను మోపుతున్నాయి. ఎల్‌కేజీ నుంచి పదోత రగతి దాకా వీరబాదుడు బాదుతున్నాయి. కొత్తగా చేరేవారైతే అడ్మిషన్‌కే వేలకువేలు సమర్పించుకోవాల్సిన పరిస్థితి దాపురించగా, బోధనకైతే 'రేంజ్'ను బట్టి ఒక్కో తరగతికి రూ.15 వేల నుంచి రూ.50 వేలకు పైగా పిండుతున్నాయి. ఇక పుస్తకాలు, యూనిఫాంలు, షూలకు రూ.10 వేల నుంచి రూ.15 వేల దాకా వసూలు చేస్తుండగా, పట్టించుకోని విద్యాశాఖ అధికారులపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- కరీంనగర్ కమాన్‌చౌరస్తా, జూన్ 23



మెజారిటీ ప్రైవేట్ పాఠశాలలు ఫక్తు వ్యాపార కేంద్రాల్లా మారాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో నాలుగు జిల్లా కేంద్రాలతో పాటు, నియోజకవర్గ, మండల కేంద్రాలు, మున్సిపాల్టీల్లో విస్తరించిన పలు ప్రైవేట్ పాఠశాలలు ఇష్టారాజ్యంగా వసూలు చేస్తున్నాయి.

ఫీజుల మోత..

ఆయా పాఠశాలల యాజమాన్యాలు డొనేషన్, రిజిస్ట్రేషన్, ఎంట్రెన్స్, అడ్మిషన్ ఇలా రకరకాలు పేర్లు చెప్పి పాఠశాలలో చేరేందుకే రూ.2 వేల నుంచి మొదలు రూ.30 వేల వరకు వసూలు చేస్తున్నాయి. ఇక ఫీజులు ప్లే స్కూల్‌కే రూ.20 వేలతో ప్రారంభించి, పదో తరగతికి రూ.లక్ష వసూలు చేసే పాఠశాలలు జిల్లా కేంద్రాల్లో ఉన్నాయనడంలో అతిశయోక్తిలేదు. వీటికితోడు యూనిఫాం, పాఠ్య పుస్తకాలకే క్లాసును బట్టి రూ.6 వేల నుంచి రూ.10 వేల దాకా గుంజుతున్నాయి. ఇంకా ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, డ్యాన్స్, ఎక్స్‌ట్రా యాక్టివిటీస్ పేరిట పెద్ద మొత్తంలో ఫీజులు గుంజుతున్నారు. ఎక్స్‌ట్రా యాక్టివిటీస్‌కు సంబంధించి ప్రవేశాల టైంలో చెప్పకుండా విద్యాసంవత్సరం మధ్యలో వసూలు చేస్తుండడంతో తల్లిదండ్రులు ఆగమైపోతున్నారు.

చెప్పిన చోటే యూనిఫాం, షూ

ఫీజుల విషయంలో తగ్గని పలు ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు, యూనిఫాంల ద్వారా లబ్ధిపొందుతున్నాయి. తాము చెప్పిన షాపుల్లోనే యూనిఫాం తీసుకోవాలని పిల్లల తల్లిదండ్రులకు సూచిస్తూ సొమ్ముచేసుకుంటున్నాయి. ఇదే మేం బయట కొనుక్కుంటాం అంటే, 'మీకు లోగో రాదు, లోగో లేకుంటే స్కూల్‌లో అలో చేయరు' అంటూ బయపెడుతున్నారు. స్కూల్ షూ విషయంలోనూ తల్లిదండ్రులకు ధరల భారం తప్పడం లేదు. స్కూల్ యాజమాన్యం చెప్పిన షాప్‌కు వెళ్తే బయట మార్కెట్‌లో రూ.300 దొరికే షూను, రూ.599 విక్రయిస్తున్నారు. ఇక కలర్ సాక్స్‌లు కావాలంటే రేటు రెట్టింపు చేసి విక్రయిస్తున్నారు.

పుస్తకాలపై ముద్ర లేకుంటే అంతే..

పాఠశాలల్లో పుస్తకాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం గతంలోనే ఉత్తర్వులిచ్చింది. దీన్ని అలుసుగా తీసుకున్న పలు ప్రైవేటు, కార్పొరేటర్ పాఠశాలలు విద్యార్థుల కోసం ఒక ప్రైవేటు కేంద్రం ఏర్పాటు చేసి అక్కడే పుస్తకాలు విక్రయిస్తున్నారు. పాఠ్య పుస్తకాలతో పాటు, నోట్ బుక్స్ కూడా అక్కడే కొనాలనే నిబంధనలు పెడుతున్నారు. ఒక వేళ ఆ నోట్ బుక్స్ తీసుకోకుండా పాఠశాలకు వెళ్తే ఆ పాఠశాల ముద్ర లేకుంటే వాటిని ఉపాధ్యాయులు తిరస్కరిస్తున్నారు. పలు విద్యార్థి సంఘాల నాయకులు వాటిని అరికట్టాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినా, చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

గవర్నింగ్ బాడీలు ఎక్కడ?

ఒక పాఠశాల ఏర్పాటు చేయాలంటే ఒక ట్రస్ట్ పేరుతో ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అప్పుడే ఆ పాఠశాలకు ప్రభుత్వ గుర్తింపు ఉంటుంది. అలా ఏర్పాటైన పాఠశాలకు గవర్నింగ్ బాడీ తప్పని సరి, ఇందులో ట్రస్ట్ చైర్మన్, కరస్పాండెంట్, హెచ్ఎం, టీచర్, పేరంట్ అందరూ భాగస్వాములవుతారు. వీరు ఏ తరగతికి ఎంత ఫీజు ఉంచాలి..? ఏ ఉపాధ్యాయుడికి ఎంత జీతం చెల్లించాలనే..? నిర్ణయాలు తీసుకుంటారు. ఇది ప్రతి పాఠశాలలో ఉండాలి. కానీ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న వెయ్యికి పైగా పాఠశాలల్లో వీటి ఉసే లేకుండా పోయింది.

చర్యలు తీసుకుంటున్నాం..

ప్రైవేటు పాఠశాలల్లో ఫీజు నియంత్రణకు సంబంధించిన ఉత్తర్వులు ప్రభుత్వం నుంచి రాలేదు. కానీ, పాఠశాల్లో యూనిఫాం, స్టేషనరీ, పుస్తకాలు అమ్మరాదని ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేశాం. అయినా అమ్మినట్లు మా దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటాం. ఈ విషయంలో ఇప్పటి వరకు మా దృష్టికి వచ్చిన రెండు పాఠశాలలపై కూడా చర్యలు తీసుకున్నాం. అక్కడ అమ్ముతున్న స్టేషనరీని సీజ్ చేశాం.

- జనార్ధన్ రావు, జిల్లా విద్యాశాఖ అధికారి, కరీంనగర్

వ్యాపారంగా మార్చాయి..

ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలను విద్యను ఒక వ్యాపారంగా మార్చాయి. 'ఏ, బీ, సీ, డీ..' అంటూ ఆంగ్ల అక్షరాలు నేర్చుకునేందుకు లక్షల రూపాయలు వసూలు చేస్తున్నాయి. పాఠశాలల నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ అడ్మిషన్ టెస్ట్, అడ్మిషన్ ఫీజు, స్కూల్ ఫీజులు పేరుతో వేలాది రూపాయలు దండుకుంటున్నారు. పాఠశాలల్లో స్టేషనరీ బుక్స్, యూనిఫాం, ఆఖరుకు బూట్లు కూడా అమ్ముతున్నారు. ఈ విషయంలో విద్యాశాఖ అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. వారు చర్యలు తీసుకుని ఆయా పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి.

- కసిరెడ్డి మణికంఠ రెడ్డి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు

బాలికపై వృద్ధుడి లైంగికదాడి

- జగిత్యాల జిల్లా రాయికల్‌లో ఘటన • నిందితుడిపై పోక్సో కేసు

రాయికల్, జూన్ 23: రాష్ట్రంలో బాలికలు, మహిళలపై ఆఘాయిత్యాలు కొనసాగుతూనే ఉన్నాయి. మొన్న పెద్దపల్లి జిల్లా కాట్నపల్లి రైస్‌మిల్లులో ఆరేండ్ల చిన్నారిపై లైంగిక దాడి హత్య, నిన్న నాగర్‌కర్నూల్ జిల్లా మొలచింతలపల్లిలో చెంచు మహిళపై లైంగిక దాడి లాంటి ఘోరాలు మరువకముందే ఇదే తరహా ఘటన జగిత్యాల జిల్లాలో జరిగింది. రాయికల్‌కు చెందిన ఓ పద్నాలుగేండ్ల బాలికపై వృద్ధుడు లైంగిక దాడి చేయడం కలకలం రేపింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..రాయికల్‌కు చెందిన గంగ నర్సయ్య (60) అదే పట్టణానికి చెందిన బాలికను ఆదివారం ఉదయం తన టైలర్‌షాపులోకి పిలిచాడు. మాయమాటలు చెప్పి లొంగదీసుకొని షటర్‌ను మూసేసి లైంగికదాడి చేశాడు. ఈ విషయాన్ని స్థానికులు గమనించి అక్కడికి చేరుకున్నారు. వారిచ్చిన సమాచారం మేరకు బాలిక కుటుంబసభ్యులు చేరుకొని షటర్‌ను తెరిచి వృద్ధుడిని చితకబాది పోలీసులకు అప్పగించారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు గంగ నర్సయ్యపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కార్పొరేట్లకు కట్టబెట్టేందుకే వేలం

కలెక్టరేట్, జూన్ 23 : తెలంగాణలోని సహజ వనరులను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే క్రమంలోనే దేశంలోని బొగ్గు బ్లాకుల ను కేంద్ర ప్రభుత్వం వేలం వేస్తోందని, మై నార్టీ మేధావుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి మ హ్మద్ ఇక్బాల్ విమర్శించారు. కార్పొరేట్ వ్యాపారులకు సహజవనరులు దారాదత్తం చేయడంపై పలు సామాజిక సంస్థలు, స్వ చ్ఛంద సంఘాల ప్రతినిధులతో కలిసి నగరంలోని మంకమ్మతోట సంఘం జిల్లా కా ర్యాలయంలో ఆదివారం రౌండ్ టేబుల్ స మావేశం నిర్వహించారు. అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, 500 బొగ్గు బ్లాకుల్లో ఇప్పటికే 300 ప్రైవేట్, కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టిందన్నారు. సమావేశంలో చల్లగొండ వెంకటేశ్వర్‌రావు, ముత్తినేని అశోక్‌రావు, మండల రాజేశం, తక్కలపల్లి రాములు, రా చకొండ శ్రీధర్, వేముల వెంకటరెడ్డి, చకి లం శ్రీనివాస్ గుప్త, పాల్గొన్నారు.

హత్య కేసు నిందితులు దొరికారు

రాంనగర్, జూన్ 23: మానకొండూరు మండల కేంద్రానికి చెందిన అనంతోజు సాయికిరణ్ (29) హత్యకేసు నిందితులు దొరికారు. కరీంనగర్ రూరల్ ఏసీపీ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం.. మానకొండూర్‌కు చెందిన సాయికిరణ్‌కు అనూషతో 2016లో వివాహం కాగా వీరికి కుమారుడు ఆదర్శ్ (6), కూతురు ఆరాధ్య (4) ఉన్నారు. నాలుగేండ్ల క్రితం సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం కొండాపూర్‌లోని ఓ ఫ్లాట్ఫాం‌లో సాయికిరణ్, అనూష దంపతులు పనిచేశారు. అసిఫాబాద్ జిల్లా దహెగాం గ్రామానికి చెందిన బట్టి సునీత– శ్రీనివాస్ దంపతుల కూడా అదే ఫ్లాట్ఫాం‌లో పనిచేస్తుండేవారు. ఈ క్రమంలో సాయికిరణ్ సునీతతో తరచూ అసభ్యంగా ప్రవర్తించేవాడు. సాయికిరణ్, శ్రీనివాస్ మధ్య గతంలో గొడవ కూడా జరిగింది. దీంతో ఏడాది క్రితం సాయికిరణ్ దంపతులు మానకొండూర్ వచ్చి వండ్రంగి పనిచేస్తూ జీవిస్తున్నాడు. ఈ ఏడాది ఏప్రిల్ 18న సిద్దిపేటలో పని ఉందని తన భార్యకు చెప్పి వెళ్లిన సాయికిరణ్ తిరిగి ఇంటికి రాలేదని, గతంలో జరిగిన గొడవల నేపథ్యంలో సునీత, శ్రీనివాస్‌పై అనుమానం ఉన్నదని ఇచ్చిన ఫిర్యాదు మేరకు మానకొండూరు పోలీసులు దర్యాప్తు మొదలు పెట్టారు. అయితే ఇంటి నుంచి వెళ్లిన సాయికిరణ్ కొండపూర్ ఫ్లాట్ఫాం‌పై వెళ్లి సునీతతో గొడవ పడడంతో ఆమె తన భర్త, పిల్లలతో కలిసి స్వగ్రామం దహెగాంకు వెళ్లిపోయింది. సాయికిరణ్ అడ్డు తొలగించుకోవాలనుకొని దంపతులిద్దరూ పథకం వేశారు. ఆ మరుసటి రోజే సునీతతో సాయికిరణ్‌కు ఫోన్‌చేసి దహెగాంకు పిలిపించారు. బట్టి శ్రీనివాస్ (35), సునీత (30)తోపాటు తమ్మిడి గంగారాం (55), భీమంకర్ శ్యామ్ రావు (50) కర్రలతో సాయికిరణ్‌పై దాడి చేసి హత్య చేశారు. మృతదేహాన్ని పాడుబడ్డ బావిలో పడేసి, మహారాష్ట్రకు పారిపోయారని తేలిందని, రెండు నెలలు శ్రమించి నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు.

వివరాలు వెల్లడిస్తున్న కరీంనగర్ రూరల్ ఏసీపీ వెంకటరమణ

సరెండర్ చేయవద్దు

జీవిత బీమాపై నిపుణులు ఏమంటున్నారో తెలుసా

ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నవారు, అధిక మొత్తాల్లో ఉన్న ప్రీమియంలు చెల్లించలేకపోతున్నవారు, పాలసీ అనవసరంగా భావించినవారు.. తమ జీవిత బీమా పాలసీలను సరెండర్ చేస్తూంటారు. మరికొందరు అమ్ముతూ ఉంటారు. అయితే ఈ రెండింటిలో ఏది లాభం? నిపుణులు ఏం చెప్తున్నారు.

ఇదీ సంగతి..

మీ జీవిత బీమా పాలసీని సరెండర్ చేయడం కన్నా.. అమ్ముకుంటే ఎక్కువ మొత్తంలో నగదును పొందగలరని నిపుణులు సూచిస్తున్నారు. పాలసీని సరెండర్ చేయడం అంటే మీ కవరేజీని రద్దు చేసుకోవడమే. మీ పాలసీ పత్రాలను తిరిగి సదరు కంపెనీకే ఇచ్చేయాల్సి ఉంటుంది. ఇందుకుగాను మీకు ఆ బీమా పాలసీని అమ్మిన సంస్థ.. వెంటనే దాని సరెండర్ విలువను చెల్లిస్తుంది. సంస్థ నిర్ణయించినదే వస్తుంది. ఎలాంటి సంప్రదింపులకు ఆస్కారం లేదు. ఈ క్రమంలో ఏవైనా చార్జీలు పడితే వాటిని ఆ మొత్తం నుంచి మినహాయించుకుంటుంది కూడా. దీంతో మీకు తక్కువ నగదు మొత్తాలు రావచ్చు.



సెకండరీ మార్కెట్‌లో..

మీకు అనవసరంగా అనిపించిన లేదా మీరు భారంగా భావించిన మీ పాలసీని సరెండర్ చేయకుండా సెకండరీ లైఫ్ ఇన్సూరెన్స్ మార్కెట్‌లో అమ్ముకోవడానికి కూడా వీలున్నది. దీన్ని లైఫ్ ఇన్సూరెన్స్ సెటిల్మెంట్‌గా పిలుస్తారు. సరెండర్ చేస్తే మీకు త్వరితగతిన మీరు చెల్లించిన నగదు తిరిగి రావచ్చుగానీ.. అమ్ముకుంటే మాత్రం ఎక్కువ మొత్తంలో నగదును పొందే అవకాశం ఉంటుంది. ఇక అమ్ముకుంటే మీ పాలసీ ప్రీమియంలన్నీ కూడా దాన్ని కొన్నవారే చెల్లిస్తారు. అలాగే మీరు చనిపోయినప్పుడు మీ మరణానంతర ప్రయోజనాలన్నీ కూడా పాలసీని కొన్నవారికే అందుతాయి. ఒక్కమాటలో చెప్పాలంటే పాలసీ యాజమాన్య హక్కులను మీరు అమ్ముకుంటున్నారన్నమాట.

ఎవరు కొంటారు?

సెకండరీ మార్కెట్‌లో జీవిత బీమా పాలసీల్లో తమ నగదును పెట్టుబడిగా పెట్టే ప్రైవేట్ ఇన్వెస్టర్లు కొంటారు. అలాగే ప్రైవేట్ సెల్లర్ల నుంచి జీవిత బీమా పాలసీలను కొనే లైఫ్ సెటిల్మెంట్ కంపెనీలుంటాయి. బ్రోకర్ల ద్వారా ఈ లావాదేవీలు జరుగుతాయి. ఇక బ్యాంకులు లేదా క్రెడిట్ యూనియన్ల వంటి ఇతర ఆర్థిక సంస్థలూ కొంటాయి. కాగా, వయస్సు, ఆరోగ్య పరిస్థితులనుబట్టి కూడా పాలసీలకు సెకండరీ మార్కెట్‌లో ధరలు పలుకుతాయి. అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటుంటే మరణం సంభవించే అవకాశాలు ఎక్కువ కాబట్టి అధిక మొత్తాల్లో చెల్లించి పాలసీలను కొనేందుకు బయ్యర్లు ముందుకొస్తారని మార్కెట్ వర్గాలు చెప్తున్నాయి. అలాగే తక్కువ మొత్తాల ప్రీమియంలతో కూడిన పాలసీలున్నా.. ఆకర్షణీయ ధర లభిస్తుంది. పాలసీకున్న మరణానంతర ప్రయోజనాలనుబట్టి కూడా ధరలు పెరుగుతాయి. పాలసీ సెల్లర్లు సంప్రదింపుల ద్వారా కూడా తమ పాలసీ ధరల్ని పెంచుకోవచ్చు.

జీవిత బీమా సరెండర్ చేస్తే..

అనుకూలతలు	ప్రతికూలతలు
✓ త్వరగా మీ పాలసీ నుంచి బయటపడుతారు	✗ సరెండర్ ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది.
మీరు మీ పెట్టుబడిలో కొంత మొత్తాన్ని తిరిగి పొందుతారు	ఎలాంటి సంప్రదింపులకు తావుండదు

అమ్ముకుంటే

అనుకూలతలు	ప్రతికూలతలు
మీ పాలసీకి మీరు మరింత సొమ్మును పొందవచ్చు ✓	✗ సరైన కొనుగోలుదారుడిని వెతికేందుకు సమయం పట్టవచ్చు
కొనే వారినిబట్టి రకరకాల ఆఫర్లు, సంప్రదింపులకు వీలుంటుంది	లాయర్ లేదా ఇన్సూరెన్స్ బ్రోకర్ల సాయం తీసుకోవాల్సి రావచ్చు

చివరగా..

పాలసీని సరెండర్ చేయడమో లేదా అమ్ముకోవడమో అనేది పాలసీదారులకు చిట్టచివరి మార్గంగా మాత్రమే ఉండాలి. ప్రతీ చిన్న అవసరం కోసం జీవిత బీమా పాలసీలను వదులుకోరాదు. అలాగే ఆర్థిక సలహాదారులను సంప్రదిస్తే మరే ఇతర ప్రత్యామ్నాయ మార్గాలనైనా వారు సూచించగలరు. అలా నిధుల అవసరాలను తీర్చుకోవచ్చేమోనని కూడా ప్రయత్నిస్తే మంచిది. దీనివల్ల కుటుంబానికి మేలు చేసినవారు అవుతారు. మీరు లేని సమయంలో మీ వాళ్లకు భరోసా ఒక్క బీమా మాత్రమేనన్నది మరువద్దు.

ఎదురయ్యే నష్టాలివే..

- **జీవిత బీమాను సరెండర్ చేసినా, అమ్ముకున్నా మరణానంతర ప్రయోజనాలను కోల్పోతారు.**
- **ముఖ్యంగా మీ కుటుంబానికి అందే దీర్ఘకాలిక ఆర్థిక సుస్థిరత అవకాశాలు దూరమవుతాయి.**
- **అంతేగాక ఒక పాలసీని సరెండర్ చేస్తే.. మరొక పాలసీని తీసుకోవాలనుకున్నప్పుడు మీకు సమస్యలు ఎదురుకాగలవు.**
- **సరెండర్ చార్జీలతోపాటు మీరు అందుకునే నగదు మొత్తాలపైనా పన్నులు చెల్లించాల్సి రావచ్చు.**
- **తొందరపడి తీసుకునే నిర్ణయాలతో నష్ట తీవ్రత పెరుగవచ్చు.**

ఇట్లుంటే తిప్పలు తప్పవు

ఆర్థిక ప్రగతిని సాధించాలంటే క్రమశిక్షణ ఎంత అవసరమో.. కొన్ని దురలవాట్లను దూరం చేసుకోవడం కూడా అంతే ముఖ్యం. ప్రధానంగా పెట్టుబడులు, పొదుపు, ఖర్చులు ఇలా పలు అంశాల్లో తెలివిగా వ్యవహరించాలి.

ఆలోచించకుండా తొందరపాటుతో స్టాక్ మార్కెట్లలో నేరుగా పెట్టుబడులకు దిగితే నష్టాలే. పూర్తిస్థాయి అవగాహన ఉంటేనే ఇండివీడ్యువల్ స్టాక్స్‌ను కొనుగోలు చేయాలి. ఇక చిన్న మదుపరులు ఎట్టి పరిస్థితుల్లోనూ రిసెర్చ్ చేయకుండా మదుపు చేయరాదు. రిటైల్ ఇన్వెస్టర్లూ నిపుణులను సంప్రదించి గానీ స్టాక్స్ కొనుగోళ్లకు దిగవద్దు. స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులపట్ల ఆసక్తి ఉంటే మ్యూచువల్ ఫండ్స్ ద్వారా ముందుకెళ్లవచ్చు.

అత్యవసర నిధిపై అశ్రద్ధ

అత్యవసర నిధిపై చాలామంది అశ్రద్ధ వహిస్తున్నారు. ముఖ్యంగా నేటి యువతరం సరదాలు, సంతోషాలకే ప్రాధాన్యతనిస్తూ ఖర్చులకు తెగబడుతున్నారు. క్రెడిట్ కార్డులు, మొబైల్ వ్యాలెట్లు అంటూ విచ్చలవిడిగా వాడేస్తున్నారు. అత్యవసర సమయాల్లో ఆర్థిక ఇబ్బందులకు లోనవుతున్నారు. అందుకే కొంత నగదు మొత్తాలతో ఎమర్జన్సీ ఫండ్‌ను సృష్టించుకోవాలని సలహా.

బీమాపై చిన్నచూపు

బీమాను చిన్నచూపుతో చూడవద్దు. అలాగే దీన్నో పన్ను ఆదా సాధనంగా పరిగణించవద్దు. పాలసీలను పన్ను కోణంలో చూసి కొంటే.. దాని ప్రయోజనాలు పూర్తిగా అందవు. కాబట్టి ఆపత్కాలంలో అన్నివిధాల అండగా ఉండే బీమానే ఎంచుకోవాలి.

మితిమీరిన రుణ భారం

ఆదాయం ఉన్నదికదా అని నేడు చాలా మంది ఎడాపెడా అప్పులు చేసేస్తున్నారు. క్రెడిట్ స్కోర్ బాగుందంటూ ఎవరు ఏ రకంగా లోన్ ఇస్తామన్నా వద్దనకుండా తీసేసుకుంటున్నారు. దీనివల్ల రుణ భారం పెరిగిపోయి అప్పుల ఊబిలో కూరుకుపోయే ప్రమాదం పొంచి ఉన్నది.

ఆర్‌డీలను ఉపసంహరిస్తారా?

పోస్టాఫీస్ రూల్స్ ఏం చెప్తున్నాయ్

పోస్టాఫీస్ రికరింగ్ డిపాజిట్ (ఆర్‌డీ)లో పెట్టుబడులు పెట్టాలనుకుంటే.. దాని కాలపరిమితి ఐదేండ్లుంటుంది. అయితే ఈలోగా ఏదైనా అత్యవసరంగా నిధులు కావాల్సి వచ్చి సదరు ఆర్‌డీ ఖాతాను ఉపసంహరించుకోవాలంటే ఏం చేయాలి? నిబంధనలు ఎలా ఉంటాయి? వీటిని ఒక్కసారి పరిశీలిస్తే..

మూడేండ్ల తర్వాత..

తపాలా కార్యాలయ రికరింగ్ డిపాజిట్ ఖాతాలను.. మొదలుపెట్టిన మూడేండ్ల తర్వాత నిర్ణీత గడువు తీరకముందే ఉపసంహరించుకోవచ్చు. అంటే మూడేండ్లు పూర్తయితే ఐదేండ్లదాకా ఆగనవసరం లేదు. ఇక నేషనల్ సేవింగ్స్ రికరింగ్ డిపాజిట్ అకౌంట్ రూల్స్ 2019 ప్రకారం ఫామ్–2లో అకౌంట్స్ ఆఫీస్‌కు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. మీ ఆర్‌డీ ఖాతాను తెరిచిన పోస్టాఫీస్‌కే ఈ దరఖాస్తును 'ప్రీ మెచ్యూర్ క్లోజర్ ఆఫ్ అకౌంట్'గా అందివ్వాల్సి ఉంటుంది. అయితే అడ్వాన్స్ డిపాజిట్ చెల్లింపులుంటే వాటి కాలవ్యవధి ముగిసేదాకా ఆర్‌డీ ఖాతాను ముందస్తుగా మూసివేయలేం. కాగా, ఈ నెల 22న పోస్టాఫీస్ వెబ్‌సైట్‌లో పొందుపర్చిన వివరాల ప్రకారం.. మెచ్యూరిటీకి ఒక్కరోజు ముందుగా ఖాతాను మూసేసినా దానికి పోస్టాఫీస్ సేవింగ్స్ అకౌంట్ వడ్డీరేటే వర్తిస్తుంది.

- **ఖాతా తెరిచిన ఐదేండ్లదాకా ఆర్‌డీ నడుస్తూనే ఉంటుంది.**
- **మెచ్యూరిటీ తర్వాత కూడా సంబంధిత తపాలా కార్యాలయానికి దరఖాస్తు చేసుకొని మరో ఐదేండ్లు పొడిగించుకోవచ్చు.**
- **కాలవ్యవధిని పొడిగించుకున్న ఖాతాలను ఎప్పుడైనాసరే ఉపసంహరించుకోవచ్చు.**
- **పూర్తయిన సంవత్సరాలకు ఆర్‌డీ వడ్డీరేటే వర్తిస్తుంది. ఇంకా నెలల కాలం పదైనా మిగిలితే దానికి పోస్టాఫీస్ సేవింగ్స్ అకౌంట్ వడ్డీరేటును లెక్కించి చెల్లిస్తారు.**
- **నిర్ణీత కాలవ్యవధి వరకు నెలకు కనీసం రూ.10, ఆపై ఎంతైనా ఆర్‌డీల్లో పొదుపు చేసుకోవచ్చు. దీనికి ఫిక్స్‌డ్ వడ్డీరేటు వర్తిస్తుంది.**

పెట్టుబడుల దిశగానే..

మార్కెట్ పల్స్

గత వారం దేశీయ స్టాక్ మార్కెట్లు మెజారిటీ ట్రేడింగ్ సెషన్లలో లాభాలనే అందుకుని రికార్డు స్థాయిల్లో కదలాడాయి. అయితే ఆఖర్లో మదుపరులు లాభాల స్వీకరణకు దిగారు. దీంతో సూచీలు ఆల్‌టైమ్ హైల్లో స్థిరపడలేకపోయాయి. అయినప్పటికీ అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 217.13 పాయింట్లు పెరిగి 77వేల స్థాయికి ఎగువన 77,209.90 వద్ద స్థిరపడింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 35.50 పాయింట్లు అందిపుచ్చుకుని 23,501.10 దగ్గర నిలిచింది. ఈ వారం సైతం సూచీలు ఓవరాల్‌గా లాభాల్లోనే కదలాడవచ్చన్న అంచనాలున్నాయి. లాభనష్టాల మధ్య కొట్టుమిట్టాడినా.. చివరకు ఓ మోస్తరు వృద్ధినే చూస్తాయన్న అభిప్రాయాలు ఎక్కువమంది నిపుణుల నుంచి వినిపిస్తున్నాయి. కాగా, మదుపరులు అమ్మకాల ఒత్తిడి లోకి జారుకునే వీలు కూడా లేకపోలేదంటున్నారు. ఇక గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, అంతర్జాతీయ పరిణామాలు ఎప్పట్లాగే ఈ వార